

ఉరే సరైన శిక్ష

కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన అటవిక చర్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. దోషులకు ఉరి శిక్ష విధించాలి. అప్పుడే దాడులు చేసివారికి భయం కలుగుతుంది. ఇటువంటి చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలి.

– జి.భవాని,
ఏఎన్‌ఎం, పెంట, జి.సిగడాం



రక్షణ కల్పించాలి

పల్లెలో వైద్య సేవలను అందిస్తున్న మహిళా వైద్యులు, సిబ్బందికి ప్రత్యేక రక్షణ కల్పించాలి. ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలకు ప్రభుత్వం భరోసా ఇవ్వాలి. అప్పుడే రోగులకు సరైన వైద్యం అందుతుంది. గ్రామాలు, మండల కేంద్రాల్లోనూ వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించాలి.

– జి.పద్మవతి, ఏఎన్‌ఎం,
జి.సిగడాం



క్లుప్తంగా

శ్రీవారి పాదాల ప్రతిష్ట ఉత్సవం



శ్రీవారి పాదాల ప్రతిష్ట ఉత్సవంలో భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో ఉన్న శివబాలాజీ ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తీసుకువచ్చిన శ్రీవారి పాదాల ప్రతిష్ట ఉత్సవం బుధవారం జరిగింది. ఆలయ అర్చకులు గోపినంబాళ్ల సీతారామాచార్యులు, సత్య కూర్మాచార్యుల నేతృత్వంలో సంప్రదాయబద్ధంగా ఉత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ఇలియన్స్ క్లబ్ సహకారంతో నిర్వహించగా, ఆలయ కమిటీ సభ్యులు, భక్తుల పాల్గొన్నారు.

తలసేమియా పిల్లల కోసం రక్తదాన శిబిరం



రక్తదాతకు సర్టిఫికెట్టు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రం వద్ద తలసేమియా పిల్లల కోసం, అధిక టీబీ, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న చిన్నారుల అవసరాల కోసం బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. శిబిరంలో పాల్గొన్న ప్రముఖ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ మాట్లాడుతూ.. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ.. రక్తం కొరతగా ఉన్న సమయంలో రక్తదానం చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. రక్తదానం చేసినవారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో రాయి చంద్రశేఖర్, పూతి భాస్కరరరావు, శేఖర్, రాయితి శ్రీనివాస్, అమ్మదాబా కృష్ణ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పెంకి చైతన్యకుమార్, గొలివి రమణ పాల్గొన్నారు.

వెలగాడలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి ప్రతిష్ట శర్మ

జి.సిగడాం: మండలంలోని వెలగాడ గ్రామంలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డయేరియా, జ్వరాలతో బాధపడిన రోగులకు బాతువ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రతిష్ట శర్మ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. గ్రామంలో 8 మంది వరకు వివిధ రోగాలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. సర్పంచ్ బొల్లా జనార్దనరావు, ఎంపీటీసీ సభ్యుడు పట్నాన అదినారాయణ, పంచాయతీ కార్యదర్శి చేబ్రోలు సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. తాగునీటి బోర్లు, బావులను క్లోరినేషన్ చేయించారు. వైద్య సిబ్బంది గ్రామంలోనే ఉండి రోగులకు వైద్య సేవలను అందిస్తున్నారు.

జీఓ 117ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఆపస్ జిల్లా అధ్యక్షుడు శివరామ్‌ప్రసాద్

రణస్థలం: ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జీఓ 117ను రద్దు చేస్తామని బహిరంగ లేఖ రాసి హామీ ఇచ్చారని, ఆ హామీని నిలబెట్టుకోవాలని ఆపస్ జిల్లా అధ్యక్షుడు దుప్పల శివరామ్‌ప్రసాద్ అన్నారు. మండలంలోని పైడిభీమవరం, అర్జునవలస, జే.ఆర్.పురం, పాతర్లపల్లి హైస్కూళ్లను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగోన్నతులు చేపట్టిన తర్వాత పని సర్దుబాటును చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పూర్వపు జిల్లా అధ్యక్షుడు జి.గిరిబాబు, మండల అధ్యక్షుడు జి.చిన్నికృష్ణంనాయుడు, ప్రధాన కార్యదర్శి సింగూరు రాజు, తదితరులు పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం పరిధిలో పెదపాడులోని అంబేడ్కర్ బాలికల గురుకులంలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 5వ తరగతిలో ఎస్సీ కేటగిరీలో –19, ఓసీ-1, ఆరో తరగతిలో ఎస్సీ- ఐదు, తొమ్మిదో తరగతిలో ఎస్సీ-1, ఎస్టీ-1 ఒకసీటు ఉన్నట్టు తెలిపారు. అలాగే ఇంటర్మీడియెట్ ఫస్టియర్ ఎంపీసీలో ఎస్సీ- ఏడు, బైపీసీలో ఎస్సీ- 06, ఎస్టీ-1, ఓసీ-1, బీసీ-1 సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈనెల 30వ తేదీన పాఠశాల వద్ద అన్ని సర్టిఫికెట్లతో నేరుగా హాజరు కావాలని సూచించారు.

సాగునీరు ఏదీ?



దేవరవలసలో 60 అడుగుల లోతులో ఉన్న కాలువ

- రెండు ప్రాజెక్టులున్నా అందని నీరు
- ఎండుతున్న పంట పొలాలు
- ఆయకట్టు రైతులకు తప్పని పాట్లు

జి.సిగడాం: సకాలంలో సాగునీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్ట్‌లు ఉన్నా.. సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. అధికారుల రికార్డుల్లో తోటపల్లి నీరు జి.సిగడాం మండలం ఆయకట్టుకు వస్తున్నట్లు ఉన్నప్పటికీ.. వాస్తవంగా ఈ మండలంలోని పలు గ్రామాలకు సాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలం పరిధిలోని నడిమివలస, చెట్టుపొదిలాం, వెలగాడ, చంద్రయ్యపేట, దేవరవలస, బాతువ, ఎందువ, ఎస్‌పీఆర్‌పురం, మంగమ్మపేట గ్రామాలకు చుక్క నీరు రావడంలేదు. మడ్డువలస కాలువ ద్వారా ఇంతవరకు మండలానికి చుక్క నీరు రాలేదు. వాంద్రంగి, ఆనందపురం, సంతవురిటి, దవలపేట గ్రామాలకు పిల్ల కాలువలు ఏర్పాటు చేయలేదు. వేలాది రూపాయలు మదుపులు పెట్టి చివరకు నీరు లేకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. దేవరవలస గ్రామానికి రెండు కాలువల ద్వారా కూడా చుక్క నీరు అందడంలేదు. ఈ గ్రామ సమీపంలో 60 అడుగుల లోతులో ప్రధాన కాలువ ఉంది. చెరువుల కింద ఉన్న పంట పొలాలన్నీ పూర్తిగా బీటలు వారుతున్నాయి.

పక్కనే ఉన్నా నీరు అందని వైనం

మండలంలోని పలు గ్రామాల్లో మడ్డువలస ప్రధాన కాలువ ద్వారా సాగునీరు అందని పరిస్థితి ఉన్నా అధికారలు పట్టించుకోవడంలేదు. దేవరవలస, మంగమ్మపేట, వాంద్రంగికి, బొట్లుపేట తదితర గ్రామాల్లో కాలువ 60 అడుగలకు పైగా లోతులో ఉంది. సుమారు 12 వందల ఎకరాలకు సాగునీరు సరిగా అందడంలేదు. ఆయకట్టు పరిధిలో రైతులకు మాత్రం నీటి తీరువాలు తప్పడంలేదు. మడ్డువలస ప్రాజెక్టు విస్తరణతో పాటు ఆధునికీకరణ నిమిత్తం రైతులకు ఎదురుచూపులే మిగిలాయి. మండలంలో నాగులవలస గ్రామం వద్ద ప్రారంభమైన ఈ కాలువ 16 గ్రామాలు మీదుగా నల్లిపేట చెరువు వరకు ఉంది. ఈ కాలువ ద్వారా ఖరీఫ్ ప్రారంభంలో కూడా సాగునీరు అందడంలేదు. నల్లిపేట నుంచి కప్పరాం, దేవరవలస, మంగమ్మపేట మీదుగా లావేరు మండలానికి కాలువను విస్తరించాల్సి ఉండగా మధ్యలోనే నిలుపుదల చేశారు.



వెలగాడ-దేవరవలస మధ్యలో చుక్క నీరులేని సాగునీటి చెరువు



మంగమ్మపేటలో నీరుతోడుతున్న రైతు

ఇబ్బంది పడుతున్నాం..



కాలువల ద్వారా సాగునీరు అందడంలేదు. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కాలువను నమ్ముకుని సాగుచేస్తే కష్టాలు తప్పడంలేదు. అధికారులు స్పందించి తక్షణమే సాగునీరు అందించాలి.

– బూటు అప్పారావు,
రైతు, బాతువ

కాలువ పక్కనే ఉన్నా..



మా భూములు పక్క నుంచే కాలువ ద్వారా నీరు వెళ్లిపోతుంది. మా పంట పొలాలను కాలువ విస్తరణలో కోల్పోయాం. మా పంట పొలాలు పక్కన చాలా లోతులో కాలువ ఉంది. నీరు అందక ఇబ్బంది పడుతున్నాం.

– తిరుమరెడ్డి రమణమ్మ,
దేవరవలస, జి.సిగడాం

200 అడుగుల దూరంలోనే..



మా గ్రామ పంట పొలాకు సుమారుగా 200 వంద అడుగుల దూరంలోనే తోటపల్లి కాలువ ద్వారా సాగునీరు వెళ్లిపోతుంది. ఎన్నిసార్లు అధికారులు వినతులు ఇచ్చినా పట్టించుకోవడం లేదు.

– తొత్తడి రామారావు,
పెనసాం, జి.సిగడాం

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ప్రక్రియ నిలిపి వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వ్యవసాయ పంపుసెట్లకు, నివాస గృహలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.యుగంధర్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి అధ్యక్షతన విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ బుధవారం జరిగింది. 2000 ఆగస్టు 28న బషీర్ బాగ్ కాల్పులలో అమరవీరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ సర్కార్‌కు లొంగిపోయి రాష్ట్రంలోని నివాస గృహాలకు విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు పెట్టాలని గత రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఆరోపించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా ఈ ఒప్పందాలను రద్దు చేయకపోగా స్మార్ట్ మీటర్ల ప్రక్రియను కొనసాగిందన్నారు. ఈ ప్రక్రియను నిలిపి వేయాలని కోరారు. వామపక్ష నాయకులు కె.మోహనరావు, వి.జి.కె.మూర్తి, కె.శ్రీనివాస్, పి.తేజ పాల్గొన్నారు.

క్రీడా పరికరాల వితరణ



క్రీడా కిట్లను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఎచ్చెర్ల: లావేరు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు పాఠశాల సిబ్బందికి బుధవారం క్రీడా కిట్లును అందించారు. ఆగస్టు 29వ తేదీన మేజర్ ధ్యాన్ చంద్ పుట్టినరోజును పురస్కరించుకుని జాతీయ క్రీడాదినోత్సవం నిర్వహించనున్నారు. పాఠశాలలోని విద్యార్థులు క్రీడల్లో రాణించి, జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలనే ఆకాంక్షతో ఇదే పాఠశాలలో 2012-13లో పదో తరగతి విద్యార్థులు పాఠశాలకు విచ్చేసి వాలీబాల్, షటిల్, టెన్నిస్ క్రీడా కిట్లును అందించారు. కిట్లును అందించిన పూర్వ విద్యార్థులు రుకణాన లక్ష్మి, ఆనపు జగదీష్‌లను పాఠశాల సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పి.జగన్నాథరావు, పీడీ కె.రవికుమార్, సీనియర్ ఉపాధ్యాయులు మీసాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంప్రదాయాలను గౌరవించాలి



సంచారజాతి కుటుంబంతో సురేష్‌బాబుసింగ్

శ్రీకాకుళం న్యూకాలనీ: భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాల్సిన బాధ్యత, అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోకన్వీనర్ పి.సురేష్‌బాబు సింగ్ అన్నారు. ఆ పార్టీ ఓబీసీ మోర్చా విభాగం పిలుపు మేరకు శ్రీకాకుళం నగరంలో నివసిస్తున్న సంచారజాతుల ప్రదేశాలను బుధవారం పరిశీలించారు. వారి జీవన శైలి, విధానాలు, ఆచారాలు అడిగి తెలుసుకున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలు, అవస్థలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్టు సురేష్ సింగ్ తెలిపారు. ఆయన వెంట ఓబీసీ మోర్చా జిల్లా ప్రతినిధులు అప్పలరాజు, చిట్టి తౌడు, ఉమామహేశ్వరరావు, వెంకటాద్రి ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దళిత, ఆదివాసీ సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు న్యాయం చేయాలని దళిత, ఆదివాసీ సంఘ నాయకులు కోరారు. శ్రీకాకుళంలోని అంబేడ్కర్ విజ్ఞాన మందిర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. ఎనిమిది మంది ఉద్యోగులకు పదోన్నతులు రాగా వారిలో కొందరిని తిరిగి రివర్షన్ పద్ధతిలో వెనక్కి పిలవడం దారుణమన్నారు. దీనికి ఆరుగురు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఉండడమే కారణమన్నారు. రెవెన్యూ, పౌరసరఫరాల శాఖలో గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదన్నారు. గతంలో రెవెన్యూ సంఘాలు కలుగుజేసుకునేవని..ఈసారి ఎవరూ పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఉద్యోగుల రివర్షన్‌ను నిలవరించి ఎస్సీ, ఎస్టీ డిప్యూటీ తహసీల్దార్లకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కళ్లేపల్లి రాంగోపాల్, కేఎస్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు బేలమర ప్రభాకర్, అంబేడ్కర్ వర్సిటీ పరిరక్షణ కమిటీ నాయకులు టి.రమణ, దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా సహాయ కార్యదర్శి భైరి ధనరాజ్, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు రాకోటి రాంబాబు, సల్ల రాజు ఉన్నారు.

120 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, అధ్యాపకులు, విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ఆర్‌జీయూకేటీ ఎస్‌ఎంపురం క్యాంపస్‌లో బుధవారం సహాయ మిత్ర సంస్థ, రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. 120 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైద్య శిబిరాన్ని డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ ప్రారంభించారు. పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి పర్యవేక్షించారు.

వివాహిత అదృశ్యం

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని కేశవరాయునిపాలెం గ్రామానికి చెందిన వివాహిత ఈ నెల 25వ తేదీ నుంచి కనిపించడంలేదని ఆమె తల్లి బుధవారం లావేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బహిర్భూమికి వెళ్తానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జి.లక్ష్మణరావు తెలిపారు.

1న ఖోఖో జట్ల ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సబ్ జూనియర్స్ బాలబాలికల ఖోఖో జట్ల ఎంపికలు సెప్టెంబర్ ఒకటో తేదీన జరగనున్నాయని జిల్లా ఖోఖో అసోసియేషన్ శ్రీకాకుళం అధ్యక్ష, కార్యదర్శులు చిట్టి నాగభూషణం, సీహెచ్ ఫల్గుణరావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానం వేదికగా ఆదివారం ఉదయం 9 నుంచి ఎంపికలు మొదలవుతాయని చెప్పారు. 2010 అక్టోబర్ 3 తరువాత జన్మించిన వారు అర్హులని స్పష్టంచేశారు. ఇక్కడ ఎంపికైన వారు సెప్టెంబర్ 20 నుంచి 22 వరకు ప్రకాశం జిల్లాలో జరిగే ఏపీరాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్ ఖోఖో,ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

రక్తదాతకు సత్కారం



నవీన్‌ను సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం నగరానికి చెందిన అల్లాడ నవీన్ రక్తంతోపాటు ప్లేట్‌లెట్స్‌ను దానం చేస్తుంటారు. దీంతో ఆయన సేవానిరతిని అభినందిస్తూ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, సెక్రటరీ డాక్టర్ పైడి సింధూరలు మంగళవారం సత్కరించారు. నవీన్‌తోపాటు అతని మిత్ర బృందం కలిసి రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతుండడం అభినందనీయమన్నారు లయన్స్‌క్లబ్ మెంటర్ నటుకుల మోహన్, మార్కెటింగ్ చైర్‌పర్సన్ ఉర్లం శివతేజ, సభ్యులు పొడుగు చరణ్, డాక్టర్ పైడి ప్రదీప్, సిక్కోలు స్వచ్ఛంద సేవ సమితి సభ్యులు పొడుగు అవినాష్, సేవకులు బొట్టా సాయికుమార్, మదర్స్ ఫౌండేషన్ సుప్రజ రౌత్, ఐవీఆర్ హర్ష, అక్షయ సేవ సమితి ప్రతినిధ బొడుగు మధు పాల్గొన్నారు.

జెమ్స్‌లో లివర్ ఆపరేషన్లు విజయవంతం



ఆపరేషన్ చేయించుకున్న వ్యక్తితో జెమ్స్ వైద్యులు

శ్రీకాకుళం రూరల్: రాగోలు జెమ్స్ ఆసుపత్రిలో లివర్ ఆపరేషన్‌ను గ్యాస్ట్రో వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. దీనికి సంబంధించిన వివరాలను బుధవారం మీడియాకు వెల్లడించారు. పలాసకు చెందిన ఓ వ్యక్తి మూడు నెలలుగా తీవ్రమైన పచ్చకామెర్లుతో బాధపడుతున్నారు. జెమ్స్ వైద్యులు పరీక్షించగా పిత్తనాలపు కాన్సర్‌గా గుర్తించి ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. అలాగే ఒడిశాకు చెందిన మహిళ ఆరు నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. ఈమె హెపటైటిస్ బి, లివర్ కుడి భాగంలో రక్తనాలపు గెడ్డతో బాధపడుతున్నట్లు గుర్తించి లివర్ కుడి భాగానికి ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. లక్షల ఖర్చుతో కూడికున్న ఈ ఆపరేషన్లను డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్యసేవ, బీఎస్‌కెవై పథకాల ద్వారా ఉచితంగా నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెమ్స్ సర్జికల్ వైద్యులు మూడడ్ల రోహిత్, డాక్టర్ ఆర్.స్వామినాయుడు, రేడియాలజీ వైద్యులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న వీసీ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని అన్నారు. వర్సిటీలో బుధవారం మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగం- నష్టాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ గంజాయి, కొకై న్, హెరాయిన్, ధూమపానం, మద్యపానం వంటి వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. విలువైన భవిష్యత్తు, ఆరోగ్యం, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. ప్రశాంత సమాజం, ఉత్తమ మానవ వనరుల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ మానసిక వైద్యురాలు అఖిల, విద్యా ఫౌండేషన్ డైరెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన అవసరం

శ్రీకాకుళం పాతబస్టాండ్: కొత్త చట్టాలపై అందరికీ అవగాహన అవసరమని జిల్లా న్యాయ శాఖ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. నగరంలోని సాయికృష్ణ జూనియర్ కళాశాలలో రాజ్యాంగంపై న్యాయవిజ్ఞాన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త చట్టాల గురించి తెలియజేశారు. పాత చట్టాలను చిన్న చిన్న మార్పులు చేసి కొత్త చట్టాలను రూపొందించారన్నారు. కార్యక్రమంలో జి.ఇందిరా ప్రసాద్, ప్యానెల్ అడ్వకేట్ టి.జగన్మోహనరావు, ప్రిన్సిపాల్, పి.నరేష్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల సరఫరాలో సర్కార్ నిర్లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రైతులకు ఎరువులు అందించడంలో అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.చంద్రరావు, కె.మోహనరావు అన్నారు. జిల్లాలో యూరియా కొరత తీవ్రంగా ఉన్నప్పటికీ వారు పట్టించుకోవడం లేదన్నారు. శ్రీకాకుళంలోని రైతు సంఘ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా బస్తాను 270 రూపాయలకు అందించాల్సి ఉండగా ఆ పరిస్థితి లేదన్నారు దీంతో రైతులు ప్రైవేటు మార్కెట్‌లో రూ. 4 వందలకు, డీఏపీని 15 వందల రూపాయలకు కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. ఎరువులతోపాటు గుళికలు, జింక్‌ను వ్యాపారులు అంటగడుతున్నారన్నారు. జిల్లాలో యూరియా లభ్యం కాకపోవడంతో సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం, మందస, పలాస, వజ్రపుకొత్తూరు తదితర మండలాల రైతులు పక్కనున్న ఒడిశా రాష్ట్రం వెళ్లి అధిక ధరలకు కొనుగోలు చేసుకుంటున్నారన్నారు. రైతు పంటలను ఈ-క్రాప్ చేసినప్పటికీ ఎరువులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. అధికార యంత్రాంగం స్పందించి రైతులకు అవసరమైన ఎరువులను తక్షణమే రైతు సేవా కేంద్రాల ద్వారా అందించాలని కోరారు. కార్యక్రమంలో కె.అప్పన్న, ఎం.అజయ్, సూరయ్య, టి.నందోడు ఉన్నారు.

ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మికి అబ్దుల్‌కలాం పురస్కారం ప్రదానం



పురస్కారాన్ని అందుకుంటున్న ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం హయాతీనగరంలోని ఎంజేపీఏపీబీసీడబ్ల్యూ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ గొలివి స్వరాజ్యలక్ష్మి ప్రతిష్టాత్మక అబ్దుల్ కలాం పురష్కారాన్ని అందుకున్నారు. డే స్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ, చేయూత సోషల్ సర్వీస్ సంస్థ సంయుక్తంగా విశాఖపట్నంలోని పౌర గ్రంథాలయంలో ఈనెల 27వ తేదీ సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో ఈమెను ఘనంగా సన్మానించి, అబ్దుల్‌కలాం పురస్కారాన్ని, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. తమ పాఠశాల ప్రిన్సిపాల్‌కు అవార్డు రావడంపై ఉపాధ్యాయినులు, సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

సంక్షిప్తంగా..

భిక్షాటన చేస్తూ వ్యక్తి మృతి

శ్రీకాకుళం రూరల్: సింగుపురం గ్రామ పరిసరాల్లో భిక్షాటన చేసే 60 ఏళ్ల వృద్ధుడు బుధవారం సాయంత్రం స్థానిక బస్‌స్టాండ్ వద్ద మృతి చెందినట్లు రూరల్ ఎస్‌ఐ వాసుదేవరావు తెలిపారు. ఈయనకు సంబంధించిన బంధువులు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని రిమ్స్ ఆస్పత్రి మార్చురీలో ఉంచామన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందన

శ్రీకాకుళం కల్చరల్: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం, సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన 50 మంది ఉపాధ్యాయులను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతల సంఘం ప్రతినిధులు అభినందించారు.

నేత్రదానంపై అవగాహన అవసరం

శ్రీకాకుళం కల్చరల్: నేత్రదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల ర్యాలీని బుధవారం ప్రారంభించారు. రెడ్‌క్రాస్ ఏవో నర్సింగరావు, మేనేజర్ వి.ఎస్.ఆర్.ఎల్. గుణాకరరావు, ప్రోగ్రాం మేనేజర్ రమణ, రెడ్‌క్రాస్ పీఆర్‌ఓ పెంకి చైతన్యకుమార్ పాల్గొన్నారు.

భార్యపై భర్త దాడి

గార : భార్యపై భర్త చాకుతో దాడి చేసిన ఘటన గార మండలం బందరువానిపేటలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. ఆర్.రామారావు సీమ్యాన్‌గా పని చేసి కొంతకాలంగా ఖాళీగా ఉంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి అలవాటు పడి తన మొదటి భార్య అమ్మోరును తరచూ డబ్బుల కోసం వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో సోమవారం (ఈ నెల 26) రాత్రి భార్యతో గొడవపడిన రామారావు వంటింట్లో ఉన్న చాకుతో ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాడు. దీంతో అమ్మోరు బంధువులు వెంటనే రిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఉషూ పోటీలల్లో సిక్కోలు ఖ్యాతిచాటండి

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర ఉషూ పోటీల్లో పతకాల పంట పండించి జిల్లా ఖ్యాతి చాటి చెప్పాలని ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు ఆకాంక్షించారు. రాజమహేంద్రవరం వేదికగా ఈ నెల 29, 30 తేదీల్లో 11వ ఏపీ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్, 9వ ఏపీరాష్ట్రస్థాయి సీనియర్స్ ఉషూ ఛాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఇందులో పాల్గొనే 30 మంది జిల్లా క్రీడాకారుల బృందం బుధవారం ఇక్కడ నుంచి పయనమై వెళ్లింది. వీరికి శ్రీకాకుళంలో వీడ్కోలు పలికారు.

జిల్లా ఫుట్‌బాల్ క్రీడాకారుల ప్రతిభ

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన ఇద్దరు ఫుట్‌బాల్ క్రీడాకారులు ప్రతిష్టాత్మక టోర్నమెంట్లకు ఎంపికయ్యారు. మణిపూర్ వేదికగా సెప్టెంబర్ 3 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న ఇండియన్ ఫుట్‌బాల్ లీగ్-2024కు జిల్లాకు చెందిన కుప్పిలి నివాస్‌కుమార్ ఎంపికయ్యాడు. ఇందులో పాల్గొనే వైజాగ్ కోరమాండల్ క్లబ్ (వీసీఎఫ్‌సీ)తరఫున ప్రాతినిధ్యం వహించడమే కాకుండా ఆ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనుండటం విశేషం. గార కేజీబీవీలో 8వ తరగతి చదువుతున్న కె.పవిత్ర జాతీయస్థాయి సబ్ జూనియర్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ 2024-25కు ఎంపికైంది.